సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 15 । ఆగస్టు । 2024



వేములవాడ: తెలంగాణచౌక్‌లో బుధవారం సామూహిక జాతీయ గీతాలాపనకు హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు, విద్యార్థులు

బాపూజీ కీర్తి.. స్వాతంత్య్ర స్ఫూర్తి



ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా..
ఏ పీఠమెక్కినా.. ఎవ్వరేమనినా..
పొగడరా నీతల్లి భూమి భారతిని..
నిలుపరా నీ జాతి నిండు
గౌరవమును..

1947 ఆగస్టు 15న ఆంగ్లేయుల బానిసత్వం నుంచి విముక్తి కలిగింది. అదేరోజు దేశానికి స్వాతంత్య్రం సిద్ధించింది. ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులందరూ పంద్రాగస్టును పండుగలాగా జరుపుకుంటారు. మనమంతా స్వేచ్ఛగా ఉన్నామంటే ఎందరో సమరయోధుల త్యాగాల ప్రతిఫలం. వారు దేశాన్ని ఎలా గొప్పగా చూడాలని కలలు కన్నారో.. ఆ కలలను సాకారం చేయడం మనందరి కర్తవ్యం. దేశ కీర్తిప్రతిష్టలు పెంపొందించడం అందరి బాధ్యత. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకోవడం మన ధర్మం. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా పలుగ్రామాలు స్వాతంత్య్రోద్యమం నడిపిన బాపూజీ బాటలో నడుస్తున్నాయి. ఆయన కలలు నిజం చేసేందుకు కదులుతున్నాయి. ఏ గ్రామంలో ఏ ప్రత్యేకత ఉంది..? ఎవరు ఎలా ముందుకెళ్తున్నారు..? ఎవరి ఆశయం ఏంటి తదితర వివరాలతో స్వాతంత్య్ర దినోత్సవ ప్రత్యేక కథనం..

ఎర్రకోటపై 'వావిలాల' జెండా రెపరెపలు



వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్

జమ్మికుంట: దేశ స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో జమ్మికుంట మండలం వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ ఊపిరిపోసుకుంది. ఇక్కడి ఖాదీతో తయారైన జాతీయజెండా దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై రెపరెపలాడింది. మహాత్మాగాంధీ పిలుపు మేరకు విదేశీ వస్త్రాల బహిష్కరణ, స్వదేశీ వస్త్రాల తయారీ ఉద్యమంలో భాగంగా ఆయన శిష్యులు అన్నా సాహెబ్ సహస్త్రబుద్దే, లేలేజీ జమ్మికుంట మండలం వావిలాల పరిసర ప్రాంతంలో పర్యటించారు. గ్రామంలో 1929లో మహారాష్ట్ర చరఖా సంఘ్‌ను ప్రారంభించారు. స్వాతంత్య్రం తరువాత 1951లో శ్రీ రామానంద తీర్థ, దివంగత ప్రధాని పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో భాగ్యనగర్ ఖాదీ సమితి పేరుతో పునః ప్రారంభించారు. భాగ్యనగర్ సంస్థ నుంచి 1967లో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ విడిపోయింది. 1983లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ ఏర్పడింది. కాగా.. 1972లో దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15, జనవరి 26 సందర్భంగా ఆవిష్కరించిన జాతీయ జెండాలు వావిలాల ఖాదీలో తయారు చేసినవే. ప్రస్తు తం బెంగళూరు ఖాదీ సంస్థ జాతీయ జెండాలను తయారు చేస్తోందని వావిలాల ఖాదీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపా రు. వావిలాల ఖాదీ ప్రస్తుత చైర్మన్‌గా పీవీ నరసింహారావు కుమార్తె ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, వొడితెల కిషన్‌రావు కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

జగిత్యాలలో నిత్య జనగణమనకు ఆరేళ్లు

జగిత్యాలటౌన్/పెగడపల్లి: జగిత్యాలలో ఉత్తూరి గంగాధర్ నేతృత్వంలో 60 మందితో ప్రారంభించిన నిత్యజనగణమన కార్యక్రమం ఆరేళ్లకు చేరుకుంది. గడియారం వద్ద ప్రతీరోజు ఉదయం 9.15 గంటలకు జాతీయగీతం ప్రారంభమవుతుంది. 2018 అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజు ప్రారంభించిన కార్యక్రమం 2,140 రోజులుగా విజయవంతంగా కొనసాగుతోంది. పెగడపల్లిలోని అంబేద్కర్‌చౌరస్తాలో 2022 ఏప్రిల్ 10వ తేదీ నుంచి నిత్య జనగణమన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

వేములవాడలో నేటి నుంచి..

వేములవాడ: నేటినుంచి నిత్యజనగణమన కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసింది. నిత్యం ఉదయం 9 గంటలకు నిత్యజనగణమన నిర్వహణకు రూ.5లక్షలు వెచ్చించి ప్రధాన కూడళ్లలో మైక్‌లు ఏర్పాటు చేయనున్నారు.



జాతీయ గీతాలాపనలో జగిత్యాల ప్రజలు

మాట్లాడుకుందాం రమ్మని..



సైదాపూర్: ఎలబోతారం, రాములపల్లి, ఎల్లంపల్లి గ్రామాల్లో సుమారు 200 మందిమి ఒక్కటై రజాకార్లను ఎదిరించినం. మాలో నలుగురు రజాకార్ల చేతిలో చనిపోయింద్రు. గుజ్జుల పుల్లారెడ్డిని ముక్కలుగా నరికి చంపింద్రు. ఎకరం ఉన్నోడికి తాసీల్ కింద ఆరు కుంచాల వడ్లు తీసుకున్నరు. లేదా రూపాయి పావలా వసూలు చేసింద్రు. పన్ను కట్టనోళ్లను వంగబెట్టి మీద బండలు ఎత్తింద్రు. ఈ దురాగతాలు భరించలేక యువకులందరం ఎదురుతిర్గినం. గప్పుడే హైదరాబాద్ దొరసింగ్ మా కాడికి అచ్చింద్రు. ఊళ్లలో సమావేశాలు పెట్టింద్రు. చైతన్యం తెచ్చింద్రు. రజాకార్లలో ఒకడిని, ప్రభువును మేం చంపినం. ఇగ గొడవలు అద్దు. మాట్లాడుకుందాం.. రమ్మన్నరు. ఎలబోతారంలో డేరా ఏసింద్రు. ఖాసీ ఒరజ్వీ అక్కడికి పిలిచింద్రు. నమ్మినం. 130 మందిమి అక్కడికి పోయినం. మమ్మల్ని హుజూరాబాద్ వరకు నడిపించింద్రు. అక్కడ జైల్లో పెట్టింద్రు. ఎలబోతారం, రాములపల్లి, ఎల్లంపల్లిలో 200 మందిలో 40 మందిని స్వాతంత్య్ర సమరయోధులుగా భారత ప్రభుత్వం గుర్తించింది. అందరూ చనిపోయింద్రు. ఇప్పుడు నేనొక్కడినే ఉన్న.

– అంగిరిక రాజలింగం, స్వాతంత్య్ర సమరయోధుడు, ఎల్లంపల్లి, సైదాపూర్

ఇల్లే గ్రంథాలయం

• ఆదర్శంగా నిలుస్తున్న అధ్యాపకుడు



తన ఇంటినే గ్రంథాలయంగా మార్చిన వీరగోని ఆంజనేయులు

వేములవాడ: తన ఇంటిని గ్రంథాలయంగా మార్చుకున్నాడు. పౌర గ్రంథాలయం అంటూ బోర్డు ఏర్పాటు చేశాడు. రెండు వైపులా గేట్లు ఓపెన్ చేసి విద్యావంతులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాడు రిటైర్డ్ అధ్యాపకుడు వీరగోని ఆంజనేయులు గౌడ్. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన వీరగోని ఆంజనేయులు 1977లో వేములవాడకు వచ్చారు. 1978 నుంచి స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా పనిచేశారు. అనంతరం రాజన్న ఆలయానికి చెందిన సంస్కృత కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. రూ.15లక్షల పైచిలుకు ఖర్చు చేసి ఇళ్లంతా పుస్తకాలతో నింపేశారు. 'నాకు పుస్తకాలంటే అమితమైన ప్రేమ. అందరికీ విద్యను పంచాలన్నదే నా లక్ష్యం. నేటికి మా ఇంట్లో 65వేల వరకు పుస్తకాలున్నాయి. 50 ఏండ్ల పత్రికలు నేటికీ జాగ్రత్తగా దాచిపెట్టుకున్నా. ప్రతిరోజు 30 మంది వరకు వచ్చి చదువుకుంటారు. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా నాకు సత్కారాలు అందాయి'. అని ఆంజనేయులు వివరించారు.

మామిడిపల్లిలో స్వాతంత్య్ర శిలాశాసనం



మామిడిపల్లిలో ఏర్పాటు చేసిన శిలాశాసనం

కోనరావుపేట: స్వాతంత్య్ర సమరయోధులను గుర్తిస్తూ భారత ప్రభుత్వం శిలాశాసనాలు ఏర్పాటు చేయించింది.ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా పోరాడిన స్వాతంత్య్ర సమరయోధులను గౌరవిస్తూ కోనరావుపేట మండలం మామిడిపల్లిలో శిలాశాసనం ఏర్పాటు చేసింది. స్వాతంత్య్రం వచ్చి పాతికేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని 1972 ఆగస్టు 14 నుంచి 1973 ఆగస్టు 14 మధ్యలో ఈ శిలాశాసనాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై స్వాతంత్య్ర సమరయోధులు శివనాగయ్య(నిమ్మపల్లి), వై.హన్మంతరావు(మామిడిపల్లి), భీమ్‌రాం గంగారామ్, వుట్కూరు నారాయణ, అనుముల మల్లయ్య, గోగు ఒగుల్‌రెడ్డి, కెప్టెన్ విజయరఘునందన్‌రావు, అనుముల ఓడెలు పేర్లు చెక్కారు. శిలాశాసనానికి రెండు వైపులా అశోకచక్రం, నెమలి, సింహం, తామరపుష్పం బొమ్మలు చెక్కారు. మామిడిపల్లిలోని పాఠశాల ఆవరణలో దీన్ని ఏర్పాటు చేయబడింది.



కె.సాయిరాం



సాయిరాం సేకరించిన గాంధీ చిత్రం

మహాత్ముల జ్ఞాపకాలు పదిలం

సిరిసిల్లటౌన్: స్వాతంత్య్ర సంగ్రామంలో భారతజాతిని చైతన్యపరిచిన జాతీయ నాయకుల పోరాటాల జ్ఞాపకాలను సిరిసిల్లకు చెందిన కొత్వాల సాయిరాం పదిల పరిచాడు. సుమారు 3,500కు పైగా వ్యాసాలు, ఫొటోలు ఆయన సేకరించాడు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం చిత్రాలను సృజనాత్మకంగా భద్రపరిచాడు. ఇప్పటికీ వంద దేశాలకు పైగా స్టాంపులు సేకరించాడు. 1947లో దేశరాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగురవేసిన తొలి జెండావిష్కరణ ఫొటో ఆయన వద్ద ఉంది. గాంధీజీపై ఉన్న అభిమానంతో ఆయన ఛాయాచిత్రాలను వందల సంఖ్యలో సేకరించాడు.

మద్యపాన నిషేధ పల్లెలు



గూడూరు గ్రామం

ముస్తాబాద్(సిరిసిల్ల)/కరీంనగర్‌రూరల్: మహాత్ముడి కలలు నిజం చేస్తూ పలు పల్లెలు సంపూర్ణ మద్యపాన నిషేధం పాటిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామంలో 18ఏళ్లుగా మద్యం విక్రయాలు కొనసాగించడం లేదు. గ్రామంలో 2006లో అప్పటి సర్పంచ్ చీటి వెంకటనర్సింగరావు ఆధ్వర్యంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని పాటించాలని తీర్మానించారు. ఊర్లో ఎవరైన మద్యం విక్రయిస్తే రూ.10వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. ఊరిలో గుట్కాలు, సిగరేట్ల విక్రయాలు కూడా నిషేధించారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో దాదాపు ఎనిమిదేళ్లుగా, హరిదాస్‌నగర్‌లో పదేళ్లుగా మద్యపాన నిషేధం కొనసాగుతోంది. కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటలో పన్నెండేళ్ల నుంచి మద్యపాన నిషేధం కొనసాగుతోంది. గతంలో మద్యం అమ్మకంతో ఊరంతా తాగుబోతుల మయంగా మారి పలు వివాదాలేర్పడ్డాయి. గ్రామపెద్దలందరూ సమావేశమై గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించవద్దని, మద్యం అమ్మితే రూ.10వేల జరిమానా వసూలు చేయాలని నిర్ణయించారు. ఒకరికి జరిమానా సైతం విధించారు అప్పటి నుంచి కట్టుబాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

నాడు భుక్తి కోసం.. నేడు దేశ రక్షణ కోసం

• ఉమ్మడి జిల్లా నుంచి సైన్యంలో సేవలందిస్తున్న వందలాది మంది యువత



గ్రామంలో పోలీసులు నిర్మించిన శాంతిస్తూపం

సారంగాపూర్: స్వాతంత్య్ర సమయంలో భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటం చేయగా.. ఇప్పుడు దేశరక్షణలో సేవలందిస్తున్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన యువత. వందలాది మంది ఆర్మీ, ఇతర రక్షణ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కొందరు ప్రాణాలు సైతం కోల్పోయారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ గ్రామం 1985 నుంచి 2004 వరకు నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఉండేది. ఇది మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి స్వగ్రామం. మావోలను అదుపు చేయడానికి పోలీసులు చేపట్టిన చర్యలతో ఇరువర్గాలవారు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల చేతిలో మరణించిన పేరున మావోయిస్టులు ఇక్కడ స్మారక స్తూపాన్ని నిర్మించారు. పోలీసులు కూడా అమరులైన వారి పేరిట శాంతి స్తూపాన్ని నిర్మించారు. పోలీసులు మావోల చర్యలను అరికడుతూనే యువతను ఉద్యోగం, ఉపాధి వైపు ప్రోత్సహించారు. ఈ చర్యలు సత్ఫలితానిచ్చాయి. గ్రామం నుంచి సైన్యంలోకి, పోలీస్ ఉద్యోగాలకు వెళ్లవద్దని మావోలు పిలుపునివ్వగా.. పోలీస్‌శాఖ తీవ్రంగా పరిగణించి ఇక్కడి యువతను సైన్యంలో, పోలీస్ ఉద్యోగాల్లో చేరడానికి ప్రోత్సహిస్తూ వచ్చింది. ఇలా ఈ గ్రామానికి చెందిన 15 మంది యువకులు సైన్యంలో చేరారు. గ్రామానికి చెందిన బోదాసు తిరుపతి, పల్లపు రమేశ్, తాళ్లపల్లి హరీశ్, పంజాల నరేశ్, సాకపురపు రాజేందర్, చల్ల రాకేశ్, అల్లకొండ సతీశ్, తుమ్మనపెల్లి నరేందర్, నరిగె వెంకటేశ్, అజ్మీరా రాజ్‌కుమార్, కందుల శ్రీనివాస్, పంజాల సురేశ్ వివిధ భద్రతా దళాల్లో పనిచేస్తున్నారు.

బోయినపల్లి నుంచి ఐదుగురు.. మల్కాపూర్ నుంచి ముగ్గురు



పబ్బాల అనిల్(ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండల యువకులు సైన్యంలో చేరి తమ దేశభక్తిని చాటుకుంటున్నారు. బోయినపల్లితోపాటు మల్కాపూర్‌కు చెందిన యువకులు ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు. బోయినపల్లికి చెందిన పర్లపల్లి శేఖర్, బైరి అనిల్, మొగులోజి మహేందర్ సైనికులుగా పనిచేస్తున్నారు. దూస శ్రీనివాస్ ఆర్మీ జవాన్‌గా ఉద్యోగ విరమణ పొందారు. నల్లగొండ కృష్ణ సీఆర్‌పీఎఫ్‌లో కశ్మీర్‌లో విధులు నిర్వహించి ప్రస్తుతం సివిల్ ఎస్సైగా కొనసాగుతున్నారు. యాద శశి ఇటీవల సైన్యంలోకి ఎంపికై బేసిక్ ట్రెయినింగ్ పొందుతున్నారు. మల్కాపూర్‌కు చెందిన మెట్టు కుమార్, అకెన అనిల్ ఆర్మీలో పనిచేస్తున్నారు.

హెలీకాప్టర్ ప్రమాదంలో అనిల్ మృతి

బోయినపల్లి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన పబ్బాల అనిల్(29) 2023, మే 4న జమ్మూకశ్మీర్‌లో జరిగిన హెలీకాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఇంటర్ వరకు చదివిన అనిల్ 11 ఏళ్ల క్రితం ఆర్మీలో చేరారు. జమ్మూకశ్మీర్ ఆర్మీ సీఎఫ్ఎస్ విభాగంలో వీఎస్ టెక్నీషియన్‌గా పని చేసేవారు.

సైనికుల కొండ...మారేడుగొండ

పెద్దపల్లిరూరల్/శంకరపట్నం: పెద్దపల్లి మండలం మారేడుగొండ గ్రామం నుంచి 20మందికి పైగా యువకులు సైన్యంలో పనిచేస్తున్నారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యువకులు ఆర్మీలో ఉన్నారు. పిడుగు హరీశ్ అతని సోదరుడు ఆర్మీలోనే పనిచేస్తున్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఏరడపల్లి గ్రామం నుంచి జంగిలి శ్రీనివాస్‌యాదవ్ మొట్టమొదట సైన్యంలో చేరాడు. ఆయన బాటలో 26మంది సైన్యంలో చేరి సేవలందిస్తున్నారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి



యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి. దేశరక్షణకు పాటుపడాలనే తపన అందరిలో ఉండాలి. దేశసేవ చేయడంలో ఎంతో తృప్తి ఉంటుంది. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేలా సైన్యంలో చేరా.

– టి.ప్రశాంత్, మారేడుగొండ

మా ఊరు ప్రత్యేకం



సీఆర్‌పీఎఫ్ తదితర విభాగాల్లో మా ఊరి నుంచి ఎక్కువ మంది పనిచేస్తున్నారు. దీంతో మా మారేడుగొండకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. 2015లో సైన్యంలో చేరిన. అరుణాచల్‌ప్రదేశ్ ప్రాంతంలో చైనా సరిహద్దు దాకా వెళ్లి పనిచేయడం ఎంతో అనుభూతినిచ్చింది.

– వి.మధుకర్, మారేడుగొండ

స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధం

• ఏర్పాట్లు పర్యవేక్షించిన ఆర్డీవో రమేశ్, ఏఎస్పీ చంద్రయ్య
• కళాశాల మైదానంలో కార్యక్రమం
• ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరు



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: స్వాతంత్య్ర వేడుకలకు రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను బుధవారం సిరిసిల్ల ఆర్డీవో రమేశ్, ఏఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్లటౌన్ సీఐ కృష్ణ, తహసీల్దార్ షరీఫ్ మొహినొద్దీన్, డీపీఆర్వో శ్రీధర్ పరిశీలించారు. జాతీయజెండా ఆవిష్కరించే స్థలం, స్టేజీ, వీఐపీ, మీడియా, ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలు, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్టాల్స్‌ను పరిశీలించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరవుతారు.

ఇదీ షెడ్యూల్

• గురువారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు
• 10.10 గంటలకు పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తారు
• 10.25 ముఖ్య అతిథి ఆది శ్రీనివాస్ సందేశం
• 10.55 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు
• 10.55 గంటలకు వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి ప్రశంసాపత్రాల ప్రదానం
• 11.30 గంటలకు కార్యక్రమం ముగింపు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

నాణ్యమైన వైద్యసేవలందించాలి

• అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

కోనరావుపేట(వేములవాడ)/తంగళ్లపల్లి(సిరిసిల్ల): రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. కోనరావుపేటలోని పీహెచ్‌సీని బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్ లేకపోవడంపై ప్రశ్నించారు. ఆయుష్‌లో అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కోనరావుపేట పీహెచ్‌సీలో అంబులెన్స్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. డీఎంహెచ్‌వో వసంతరావు, ప్రోగ్రాం అధికారి దివ్య, డీపీవో ఉమాదేవి, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, వైద్యాధికారి వేణుమాధవ్, సూపర్‌వైజర్లు మెర్సీ, సువర్ణ, రషీద్ ఉన్నారు.

నేరెళ్ల పీహెచ్‌సీ తనిఖీ

తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన విద్యార్థినులతో మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ రేఖ, సిబ్బంది ఉన్నారు.

వైద్యసేవలు ఎలా ఉన్నాయి?

• కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడఅర్బన్: ఆస్పత్రిలో వైద్యసేవలు ఎలా ఉన్నాయి, వైద్యులు, సిబ్బంది బాగానే పనిచేస్తున్నారా.. అంటూ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆరా తీశారు. వేములవాడలోని ఏరియా ఆస్పత్రిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఔట్‌పేషెంట్ విభాగాలు, ల్యాబ్, ఐపీ వార్డు, ఫార్మసీ, పిడియాట్రిక్ వార్డు, ఐసీయూలను పరిశీలించారు. ఎంత మంది జ్వరంతో వస్తున్నారు, ఎంత మందికి పరీక్షలు చేస్తున్నారనే వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ పెంచలయ్యను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి వసంతరావు, వైద్యులు సంతోష్‌చారి, దీప్తి, అనిల్ ఉన్నారు.

ప్రజా ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

సిరిసిల్ల: ప్రజా ఆరోగ్యంపై కలెక్టర్లు, వైద్యాధికారులు శ్రద్ధ చూపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, స్వచ్ఛదనం.. పచ్చదనంపై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో బుధవారం మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా, చికున్ గునియా, టైఫాయిడ్ నిర్ధారణకు రక్తపరీక్షలు ఎక్కువ సంఖ్యలో చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా పెట్టాలని, డెంగీ అవసరమైన కేసులను మాత్రమే అడ్మిట్ అయ్యేలా చూడాలన్నారు. డెంగీ కేసులు ఎక్కువగా నమోదైన ప్రాంతాల్లో అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే, ప్రతీ నెల మూడో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీఆర్డీవో శేషాద్రి, డీపీవో వీరబుచ్చయ్య, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీబేగ్, అన్వేశ్, డీఎంహెచ్‌వో వసంతరావు, డీసీహెచ్‌ఎస్ పెంచలయ్య, డీఈవో రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వివాహిత మృతి

• కూతురిపై బెంగతో ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): కూతురిపై బెంగతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై గణేశ్ కథనం మేరకు వివరాలు. ముస్తాబాద్ మండలం బందనకల్‌కు చెందిన దాచారపు రేణుక(45) అనే వివాహిత ఈనెల 8న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. రేణుక పెద్ద కుమార్తె రాధిక కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి కూతురిపై బెంగతో రేణుక తీవ్ర మనోవేదనకు గురవుతుంది. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెంది వారం రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి చిన్నకూతురు కనకతార ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కస్తూర్బా కాంట్రాక్టు పోస్టుల మెరిట్ జాబితా వెల్లడి

సిరిసిల్ల: జిల్లాలోని కేజీబీవీల్లో అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థుల మెరిట్ జాబితాను కలెక్టరేట్‌లో బుధవారం వెల్లడించారు. ఈ పోస్టులకు జూలై 27వ తేదీ నుంచి ఆగస్టు 11 వరకు దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా కలెక్టరేట్, రాజన్నసిరిసిల్ల వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే సరైన ఆధారాలతో జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఆగస్టు 16వ తేదీ వరకు అందజేయాలని కోరారు.

చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలోని పది మండలాల్లో బుధవారం చిరుజల్లులు కురిశాయి. సిరిసిల్లలో 15.5 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 1.1, వేములవాడ రూరల్‌లో 0.9, వేములవాడ 0.3, కోనరావుపేట 2.2, వీర్నపల్లిలో 0.9, ఎల్లారెడ్డిపేట 2.9, ముస్తాబాద్‌లో 2.4, తంగళ్లపల్లిలో 2.7, ఇల్లంతకుంటలో 0.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మహిళలకు షరతులు లేకుండా రుణాలు

• తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ



నిజామాబాద్ బ్రాంచ్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ శోభ

కోనరావుపేట(వేములవాడ): మహిళల ఆర్థికాభివృద్ధికి ఎలాంటి షరతులు లేకుండానే రుణాలు అందిస్తామని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ వై.శోభ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో బ్యాంక్ నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో మహిళలు బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఒక్కో సంఘానికి రూ.20లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ 430 బ్రాంచ్‌లతో రూ.28వేల కోట్ల వ్యాపారంతో ముందుకు సాగుతోందని తెలిపారు. దేశంలోనే ఉత్తమ బిజినెస్ గల బ్యాంక్‌గా టీజీబీ గుర్తింపు పొందిందన్నారు. డీఆర్డీఏ శేషాద్రి మాట్లాడుతూ మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్‌డీఎం మల్లికార్జున్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుని వడ్డీ వ్యాపారుల బారి నుంచి కాపాడుకోవాలన్నారు. జగిత్యాల రీజినల్ ఎస్ఎంవో కిరణ్, ఎస్ఎంబీ లక్ష్మీనారాయణరెడ్డి, నిజామాబాద్ మేనేజర్ శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ బానాపురం రంగారెడ్డి, ఏపీఎం రాకేశ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామ్మోహన్

ముస్తాబాద్(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, తుర్కకాశీపల్లె గ్రామాల మధ్య ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై రామ్మోహన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీర్నపల్లికి చెందిన సయ్యద్ ఇమామ్(56) అనే వ్యక్తి తుర్కకాశీపల్లెలో ఉన్న బంధువుల ఇంటికొచ్చాడు. మంగళవారం రాత్రి ఇమామ్ స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఆయన ద్విచక్ర వాహనం తాళం చెవి లభించలేదు. దీంతో నడుస్తూ కామారెడ్డి ప్రధాన రహదారి వద్దకు వెళ్లాడు. మార్గమధ్యలో ఇమామ్ రక్తం మడుగులో పడి ఉన్నాడు. బుధవారం ఉదయం ఆ దారిగుండా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే ఇమామ్ మృతిచెంది ఉన్నాడు. ఎవరైన ఆయనపై దాడి చేశారా? లేక గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కొడుకు భాష ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస్, ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి

• వెంకటాపూర్‌లో విషాదం
• చేతిలో చిల్లిగవ్వ లేక రోదిస్తున్న తల్లి


అఖిల్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన చిత్తారి అఖిల్(9) పాముకాటుకు గురై బుధవారం మృతిచెందాడు. చిత్తారి రాజు– కనకవ్వ దంపతులకు ఇద్దరు సంతానం. అఖిల్ చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో తల్లి ఇనుప సామగ్రి సేకరిస్తూ కొడుకులను సాదుకుంటోంది. ఈనెల 9న రాత్రి అఖిల్‌ను పాము కాటువేసింది. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. వరంగల్ నుంచి స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకురావడానికి చేతిలో చిల్లిగవ్వ లేక తల్లి రోదిస్తుంది. మృతదేహాన్ని తెప్పించి అంత్యక్రియల నిర్వహణకు దాతలు సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతునికి తల్లి కనకవ్వ, సోదరుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ అధికారుల విధులకు ఆటంకం

• ఇద్దరి రిమాండ్

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం నిజామాబాద్ బీట్ పరిధిలో కోనరావుపేటకు చెందిన దండుగుల కనకయ్య, దండుగుల పోచవ్వ ఎకరం భూమిని అక్రమంగా సాగుచేస్తూ గుడిసెలు వేశారని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వాటిని తొలగించేందుకు వెళ్లిన అటవీ అధికారుల విధులను ఆటంకపరిచారన్నారు. డీఎఫ్‌వో నునావత్ మోహన్‌లాల్ ఫిర్యాదుతో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బందనకల్‌లో కులబహిష్కరణ

• నలుగురిపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం బందనకల్‌లో కులబహిష్కరణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. బందనకల్‌కు చెందిన ఒకరు భూమి పంచాయితీ విషయంలో కులసంఘం పెద్ద మనుషులు బహిష్కరణ చేశారన్నారు. తాము చేసిన పంచాయితీని సదరు వ్యక్తి ఆమోదించడం లేదని, కులబహిష్కరణ చేసి, ఎలాంటి శుభకార్యాలకు పిలవడం లేదని బాధితుడు ఫిర్యాదు చేశాడని తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో నలుగురు పెద్దమనుషులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీలో కుక్కదాడిపై విచారణ

• అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాకు మెమో


వివరాలు సేకరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం బండపల్లి అంగన్‌వాడీ–1 కేంద్రంలో బాలుడిపై మంగళవారం కుక్క దాడి చేసిన సంఘటనపై ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య, అసిస్టెంట్ సీడీపీవో సుచరిత బుధవారం విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా కుక్కకాటుకు గురైన కటకం ఆరుష్ తల్లిదండ్రులు కటకం కనకరాజు, హరితలను సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కుక్క దాడి చేసిన సమయంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మ కేంద్రంలో లేదని, ఆయా కేంద్రంలో నుంచి బయటకు రాకపోవడంతో మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లిన బాలుడు ఆరుష్‌పై కుక్క దాడి చేసిందని విచారణలో తెలిందని తెలిపారు. ఇక ముందుకు ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకోవాలని, లేనిచో శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరితోపాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఉన్నారు.

కష్టపడ్డాడు.. కొలువు కొట్టాడు

• అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉద్యోగం


చేతన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇష్టంతో కష్టపడి చదివి ఎలాంటి శిక్షణ లేకుండా ఏఈఈగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు ఎల్లారెడ్డిపేటకు చెందిన యువకుడు. మండల కేంద్రానికి చెందిన రాపెల్లి అంబదాస్–హరిత దంపతుల కుమారుడు చేతన్ బీటెక్ సివిల్ చదివాడు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగా ప్రిపేర్ అయ్యాడు. ఈక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాడు. చేతన్‌ను గ్రామస్తులు అభినందించారు.

పోలీసులతో న్యాయవాదుల చర్చలు సఫలం



సిరిసిల్లటౌన్: రెండు వారాలుగా సిరిసిల్ల న్యాయవాదులు చేపట్టిన పోరాటం ఫలించింది. కోర్టు ఉత్తర్వుల అమలులో పోలీసుల తీరును నిరసిస్తూ..పద్నాలుగు రోజులుగా సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఫైట్ ఫర్ సివిల్ రైట్స్ నినాదంతో మూడు రోజులుగా కోర్టు ఎదుట రిలేదీక్షలు చేపట్టారు. బుధవారం జిల్లా జడ్జి ఆదేశాలతో ఏఎస్పీ చంద్రయ్య, ఇద్దరు డీఎస్పీలతో కలిసి కోర్టు ఆవరణలో న్యాయవాదులతో చర్చలు జరిపారు. అడ్వకేట్ల డిమాండ్లను పోలీసు అధికారులు అంగీకరించారు. బుధవారం సాయంత్రం న్యాయవాదులకు పోలీస్ అధికారులు నిమ్మరసం అందించగా దీక్షలు విరమణ చేస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి ప్రకటించారు. న్యాయవాదులు బొంపెల్లి రవీందర్‌రావు, భాస్కర్‌రెడ్డి, వసంతం, సత్యనారాయణ, వెంకటి, రజనీకాంత్ తదితరులున్నారు.

నేరస్తులకు శిక్ష తప్పదు

• ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: నేరం చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని, శిక్షలతోనే మార్పు వస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వివిధ కేసుల్లో ఒకే రోజు ముగ్గురికి జైలు శిక్ష పడడంతో వివరాలను మీడియాకు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పీపీలు వేముల లక్ష్మీప్రసాద్, నర్సింగరావు, సీఎంఎస్ ఎస్‌ఐ రవీంద్రనాయుడు, కోర్ట్ కానిస్టేబుల్ రమేశ్, మహేందర్, లతీఫ్, సీఎంఎస్ హెడ్‌కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్ నరేందర్‌ను అభినందించారు.

నిందితులకు జైలు

వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టిముల గ్రామానికి చెందిన బారాజు మల్లారెడ్డికి జీవిత ఖైదీతోపాటు రూ.5వేలు జరిమానా, బారాజు నరసింహారెడ్డికి ఏడేళ్ల జైలు, రూ.3వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత బుధవారం తీర్పు ఇచ్చారు. వట్టెంలకు చెందిన బారాజు మల్లారెడ్డి, నరసింహారెడ్డి, ఎమిరెడ్డి రాంరెడ్డి, కనకరెడ్డి, లచ్చిరెడ్డికి భూ తగాదాలున్నాయి. ఈక్రమంలో మల్లారెడ్డి, నరసింహారెడ్డి దాడి చేయగా.. రాంరెడ్డి మృతిచెందాడు. నేరం రుజువు కావడంతో న్యాయవాది తీర్పు వెల్లడించారు.

- కోనరావుపేట ఠాణా పరిధిలో హత్యాయత్నం కేసులో గంగుల రమేశ్‌కు ఏడాది జైలు, రూ.1100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్‌కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారు.
- కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన గంగుల రమేశ్ తన మేనేజర్‌పై దాడి చేసిన ఘటనలో న్యాయమూర్తి జైలుశిక్ష తోపాటు జరిమానా విధించారు.
- భార్యపై కిరోసిన్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డ కేసులో చంద్రంపేటకు చెందిన కావాలి రాజుకు ఏడాది జైలు, జరిమానా విధించారు.

పంట మార్పిడితోనే అధిక దిగుబడులు

• నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు


మాట్లాడుతున్న రవీందర్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): రైతులు పంట మార్పిడితోనే అధిక దిగుబడులు సాధిస్తారని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. దమ్మన్నపేట, గజసింగవరం, ముస్తాఫానగర్ రైతులకు కూరగాయల సాగు, పంటల మార్పిడిపై బుధవారం అవగాహన కల్పించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ కూరగాయలు, ఆరుతడి పంటలు, వాణిజ్య పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈవోలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అత్యుత్తమ సేవలు
– నాఫ్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యుత్తమ విద్యనందించేందుకు అధ్యాపకులు ఎంతగానో కృషి చేస్తున్నారని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కొనియాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బదిలీపై వెళ్తున్న అధ్యాపకులు పిట్ల దాస్, శ్రీవల్లిని బుధవారం సన్మానించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ దాస్, శ్రీవల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిలో విశేష సేవలందించారన్నారు. న్యాక్ గుర్తింపు, విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు అందరి సహకారం తీసుకున్నారన్నారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఉన్నారు.

ప్లాంటేషన్ మొక్కలు ధ్వంసం

• విచారణ చేపట్టిన అధికారులు


ధ్వంసమైన మొక్కలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ప్లాంటేషన్ మొక్కలను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో అటవీశాఖకు రూ.లక్ష నష్టం వాటిల్లింది. బుగ్గరాజేశ్వరతండాలో గిరిజనులు అనుమతులు లేకుండా సాగుచేసుకుంటున్న 10 హెక్టార్ల భూమిలో ఇటీవల ఫారెస్ట్ అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంలో గిరిజనులకు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలోనే గుర్తుతెలియని వ్యక్తులు మొక్కలపై గడ్డిమందు పిచికారీ చేసి ధ్వంసం చేయడం కలకలం రేపింది. ఈ సంఘటనపై అధికారులు విచారణ చేపడుతున్నారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు.

సహజ వనరులను కాపాడుకోవాలి

• డీఈవో రమేశ్‌కుమార్
• విద్యార్థులకు గ్రీన్‌కోర్సుపై అవగాహన


మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: సహజ వనరులను పొదుపుగా వాడి కాపాడుకోవాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. సిరిసిల్లలోని కుసుమరామయ్య జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన గ్రీన్‌కోర్సు (ఎన్జీపీ) కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కోర్సుకు జిల్లా వ్యాప్తంగా 50 పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున ఎంపిక చేశారు. డీఈవో మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను వాడి పండించిన ఆహార పదార్థాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఎల్ఈడీ బల్బులు వినియోగించి విద్యుత్ ఆదా చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు గ్రీన్ కోర్సు(ఎన్జీసీ) కార్యక్రమాన్ని కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్ఈడీ బల్బుల తయారీ, వినియోగంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎల్ఈడీ బల్బులను తయారు చేశారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ఎన్జీసీ స్టేట్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ హాజరయ్యారు.

కార్మికుల ఆరోగ్యంపై దృష్టి


మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన అనంతరం కమిషనర్ అన్వేశ్, కౌన్సిలర్లతో చైర్‌పర్సన్ మాధవి

• మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి
• 140 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ

వేములవాడ: మున్సిపల్ కార్మికుల ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే 140 మంది పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం బట్టలు పంపిణీ చేశారు. చైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉందంటే కార్మికుల శ్రమతోనే సాధ్యమైందన్నారు. కమిషనర్ అన్వేశ్ మాట్లాడుతూ కార్మికులు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు నరాల శేఖర్, గోలి మహేశ్, సిరిగిరి చందు, ఇప్పపూల అజయ్, అన్నారం ఉమ, మేనేజర్ సంపత్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

రాములోరి కల్యాణం.. రమణీయం



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో బుధవారం శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సత్సంగం వ్యవస్థాపకుడు గోవిందరాజుల ఆబ్దికాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. నంబి వేణుగోపాలాచార్య, సంగిరాల రాజేంద్రప్రసాద్‌శర్మ, రాములు పంతులు, అర్చకులు నవీన్‌చారి తదితరుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు.



సీఎంకు రాజన్న ప్రసాదం

వేములవాడ: అమెరికా, దక్షిణకొరియా దేశాల పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం కలిశారు. వేములవాడ రాజన్న ప్రసాదాలు అందించి కండువా కప్పారు.